ప్రజల చేతిలో

www.ayudamdaily.com

ఆయుధం

The Common People's Voice

బుధవారం | నవంబరు 11, 2026 | సంపుటి : 7 | సంచిక : 135 | పేజీలు : 2



- శిక్షణ పూర్తి చేసుకున్న 112 మంది డీఎస్పీలతో సీఎం రేవంత్ రెడ్డి ముఖాముఖి

ఏ హోదాకు వెళ్లినా...

గతం మరవొద్దు

ప్రభుత్వ ప్రతిష్ట పెరిగేలా నిబద్ధతతో పనిచేయాలి

హైదరాబాద్, ఆయుధం: ఏ హోదాకు వెళ్లినా మన గతాన్ని మరిచిపోవద్దని నూతన డీఎస్పీలను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మనం వచ్చిన నేపథ్యం మరిచిపోతే మన హోదాకు న్యాయం చేయలేమన్నారు. రాష్ట్ర భవిష్యత్తును రాబోయే 30 ఏళ్లు ఎలా నడిపించాలో నూతన డీఎస్పీల చేతుల్లోనే ఉందన్నారు. అధికారుల నిర్ణయాలే ప్రభుత్వ పనితీరుకు గీటురాయిగా మారతాయని వ్యాఖ్యానించారు. పోలీస్ అకాడమీలో శిక్షణ పూర్తిచేసుకున్న 112 మంది డీఎస్పీలతో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. డీజీపీ సీవీ ఆనంద్,హోంశాఖ ముఖ్యకార్యదర్శి శిఖా గోయల్, భద్రత సలహాదారు శివధర్ రెడ్డి, పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్ట్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పది మంది డీఎస్పీలు అరాచకంగా వ్యవహరించినా రాష్ట్రంలో సరైన పరిపాలన లేదనే ఆరోపణలు వస్తాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. శాంతిభద్రతలు క్షీణించి అవినీతి పెరిగిందనే ఆరోపణలు కూడా రావొచ్చన్నారు. పోలీసులు సరిగా విధులు నిర్వర్తిస్తే ప్రభుత్వ ప్రతిష్ఠ పెరుగుతుందన్నారు.

బాధితులను కూర్చోబెట్టి సమస్యలు వినండి

పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితులను కూర్చోబెట్టి ఓపికగా మాట్లాడితే సగం సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్నో అవాంతరాలు, సంక్లిష్ట పరిస్థితులను దాటుకొని ఉద్యోగాలు సాధించిన యువ అధికారులు తమ నేపథ్యాన్ని మర్చిపోకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. 112 మంది డీఎస్పీల నియామకాన్ని తమ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా చేపట్టిందని కొందరు తప్పుడు ఆరోపణలు చేసినా సుప్రీంకోర్టులో న్యాయవాదులను పెట్టి అభ్యర్థులకు అండగా నిలబడ్డామని



రేవంత్ గుర్తుచేశారు.

ప్రస్తుత రోజుల్లో పోలీసులకు సైబర్ క్రైమ్ అతిపెద్ద సవాల్ అని,వీటితోపాటు డ్రగ్స్, ఫుడ్ సేఫ్టీ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై ప్రధానంగా దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. సైబర్ క్రైమ్, ఫోరెన్సిక్ విభాగాల్లో ఆసక్తి ఉన్న డీఎస్పీలను విదేశాలకు పంపి శిక్షణ ఇప్పిస్తామన్నారు. డీఎస్పీలు ఫిట్‌నెస్ విషయంలో రాజీపడొద్దని సూచించిన సీఎం 'బెల్ట్ లూజ్ అయిన పర్వాలేదు కానీ బైట్ కాకూడదు' అని సరదాగా వ్యాఖ్యానించారు.

గతంలో గ్రూప్1 నియామకాల ప్రక్రియ చాలా ఆలస్యంగా జరిగేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆనాటి ప్రభుత్వ నిర్ణయాలు, నిర్లక్ష్యం చాలా మందికి తీరని నష్టాన్ని మిగిల్చిందని

మిగతా 2 లో..



నేడు ఓరుగల్లుకు డిప్యూటీ సీఎం

భట్టి విక్రమార్క రాక

- కాజీపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ కు శంకుస్థాపన
- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

హనుమకొండ, ఆయుధం: కాజీపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్(టీపీఎస్) భవన నిర్మాణానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం శంకుస్థాపన చేయనున్నారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ నూతన భవన నిర్మాణానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేస్తారు. కాజీపేటలోని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ బాలుర వసతిగృహం ప్రాంగణంలో నూతనంగా నిర్మించనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ కు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా శంకుస్థాపన నేపథ్యంలో... హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. విద్యారంగ అభివృద్ధికి మరొక ముందడుగు పడుతున్న నేపథ్యంలో... తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి ఎంపిక చేసిన ప్రాంతాన్ని అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించి అధికారులతో మాట్లాడారు. శంకుస్థాపన కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతర ప్రముఖులు హాజరవుతున్న నేపథ్యంలో.. ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయడంపై అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ వెంకటేష్, టీడబ్ల్యూ ఐడిసి ఈఈ అరుణ్ కుమార్, హనుమకొండ కాజీపేట తహసీల్దార్ రాజు, హనుమకొండ తహసిల్దార్ రవీందర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.





జిల్లా గ్రంథాలయ సంస్థ బడ్జెట్ ఆమోదం

వరంగల్, ఆయుధం: వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ కు సంబంధించి 2026 27 వార్షిక బడ్జెట్ను మొత్తం రూ 87,92,453/ లకు ఆమోదించారు. మంగళవారం ఉదయం 11గంటలకు గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షులు మీసాల ప్రకాష్ అధ్యక్షతన సర్వ సభ్య సమావేశము జరిగింది. ఈ సమావేశంలో బడ్జెట్ పై చర్చించి ఆమోదించారు. గ్రంథాలయ భవన నిర్మాణాలకు రూ.30,000,00 లను, పుస్తకాల కొనుగోలుకు రూ.5,60,000 లను, ఫర్నిచర్ కోసుగోలుకు రూ.3,00,000 లను బడ్జెట్ను ఆమోదించారు. ఈ సందర్భంగా మీసాల ప్రకాష్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్ర గ్రంథాలయానికి నూతన భవన నిర్మాణం కొరకు స్థల సేకరణ, నిధులు సమీకరించాలని తీర్మానించారు. వరంగల్ జిల్లాలో శాఖా గ్రంథాలయాలకు నూతన భవన నిర్మాణం కొరకు ఎమ్మెల్యే, ఎంపీ ఫండ్ ప్రభుత్వ నిధులను ఖర్చు చేయుటకు తీసుకురావాలని తీర్మానించారు.సిబ్బంది ఖాళీల భర్తీకి ఔట్సోర్సింగ్ పోస్టులను నియామకం కొరకు తీసుకురావాలని తీర్మానించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.బుగ్గారెడ్డి, వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రశాంత్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి కే.కల్పన, పౌర సంబంధాల జిల్లా సమాచార అధికారిని బి.ప్రేమలత, జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా వయోజన విద్యాధికారి జె.రమేష్ రెడ్డి, గ్రేడ్1 లైబ్రరీ వి.అర్జున్, మేకల చిన్న బాబు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోలీస్ క్రికెట్ పోటీల్లో సత్తా చాటాలి

- వరంగల్ క్రికెట్ జట్టుకు సీపీ ఎన్.శ్వేత ఐపిఎస్ శుభాకాంక్షలు



హనుమకొండ, ఆయుధం: ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 5వ రాష్ట్రస్థాయి పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్-2026లో పాల్గొనేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ తరపున క్రికెట్ జట్టును ఎంపిక చేశారు. ఈ జట్టుకు గీసుగొండ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డి.విశ్వేశ్వర్ నాయకత్వం వహించనున్నారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రికెట్ జట్టు సభ్యులను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపిఎస్ అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాస్ఫూర్తితో ఆడి, ఉత్తమ ప్రతిభ కనబరిచి వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జట్టు సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టుల అనుమతుల వివరాలివ్వండి


ఏపీ, తెలంగాణకు కేఆర్ఎంబీ లేఖ

హైదరాబాద్, ఆయుధం: శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులకు సంబంధించి అసలు అనుమతుల వివరాలు సమర్పించాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కృష్ణానదీ యాజమాన్య బోర్డు తెలిపింది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు కేఆర్ఎంబీ లేఖలు రాసింది. ప్రాజెక్టుల అసలు రూపకల్పన,నీటి వినియోగం,కాల్వల సామర్థ్యం, ఆయకట్టు వివరాలతో పాటు ఆ తర్వాత చేపట్టిన మార్పులు, అదనపు నీటి అవసరాల వివరాలు ఇవ్వాలని కోరింది. కేంద్ర జలశక్తి శాఖ సూచనల మేరకు మొదట ఆమోదించిన ప్రాజెక్టు వివరాలనే ప్రామాణికంగా తీసుకొని తదుపరి మార్పులను పరిశీలించనున్నట్లు పేర్కొంది.

శ్రీశైలం ప్రాజెక్టులో 11,నాగార్జునసాగర్‌లో రెండు అనుమతి లేని భాగాలు ఉన్నట్లు 2021 నాటి నోటిఫికేషన్‌లోకేంద్రం ప్రస్తావించిందని గుర్తు చేసింది. ఈ మార్పులకు సంబంధించిన సాంకేతిక అనుమతులు,కేంద్ర సంస్థల క్లియరెన్స్ వివరాలను కూడా సమర్పించాలని నవంబర్ 6న జారీ చేసిన లేఖలో రెండు రాష్ట్రాలను కోరింది. గతంలో సెప్టెంబర్ 21,అక్టోబర్ 1,అక్టోబర్ 16,అక్టోబర్ 30 తేదీల్లో రాసిన లేఖలకు సంబంధించిన వివరాలు కూడా ఇంకా అందలేదని లేఖలో కేఆర్ఎంబీ పేర్కొంది.

పవిత్ర మాసం కార్తీకం: నాయిని

- వేయి స్తంభాల దేవాలయంలో కార్తీక మాసోత్సవాలు ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



హనుమకొండ, ఆయుధం: హనుమకొండలోని చారిత్రక శ్రీరుద్రేశ్వర స్వామి(వేయి స్తంభాల దేవాలయం) ఆలయంలో కార్తీక మాసోత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ పక్షాన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్తీక మాసోత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. తెల్లవారుజామున బ్రాహ్మీ ముహూర్తంలో మంగళ వాయిద్యాల నడుమ ఉత్తిష్ఠ గణపతి ఆరాధనతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం రుద్రేశ్వర స్వామివారికి 11 లీటర్ల ఆవుపాలతో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించడంతో పాటు సామూహిక రుద్రాభిషేకాలు జరిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కార్తీక మాసం భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని, భక్తిభావాన్ని పెంపొందించే అత్యంత పవిత్రమైన మాసమని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు కులమతాలకు అతీతంగా సామూహికంగా దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించడం ఈ మాసం ప్రత్యేకత అని తెలిపారు. ఎంతో చారిత్రక ప్రాశస్త్యం కలిగిన వేయి స్తంభాల దేవాలయంలో పరమశివుడిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొనడం ఎంతో ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పుప్పాల ప్రభాకర్, నాగరాజు, తోట వెంకటేశ్వర్లు, బోడ దిన్న తదితరులు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.అనిల్ కుమార్, ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందించి ఆశీర్వచనం చేశారు.

తాగునీటి పైపులైన్ మరమ్మతు పనులను

యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న

వరంగల్, ఆయుధం: దేశాయిపేట ప్రధాన ఫిల్టర్ బెడ్ నుంచి ఎంజీఎం ఆసుపత్రి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ఎల్బీ కళాశాల, వరంగల్ డెయిరీతో పాటు కాకతీయ కాలనీ తదితర ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైపులైన్ మరమ్మతు, మార్పిడి పనులను వేగవంతంగా పూర్తి చేసి, నీటి సరఫరాను పునరుద్ధరించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. మంగళవారం ములుగు రోడ్డు వద్ద కొనసాగుతున్న ప్రధాన పైపులైన్ మార్పిడి పనులను కమిషనర్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిజాం కాలం నాటి సుదీర్ఘకాలంగా వినియోగంలో ఉన్న పాత పైపులైన్‌లో ఏర్పడిన లీకేజీల కారణంగా మరమ్మతు పనుల్లో భాగంగా కొత్త పైపులైన్ ఏర్పాటు చేస్తున్న తీరును పరిశీలించి, పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. ప్రత్యేకించి ఎంజీఎం, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల వంటి ప్రధాన వైద్య సంస్థలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ఎల్బీ కళాశాల, వరంగల్ డెయిరీ, కాకతీయ కాలనీ తదితర ప్రాంతాల ప్రజలకు సైతం నీరు అందేలా



త్వరతగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పైపులైన్ పనులు పూర్తయిన వెంటనే పరీక్షలు నిర్వహించి, తాగునీటి సరఫరాను అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. నగర ప్రజలకు, ముఖ్యంగా ఆసుపత్రులకు నిరంతర తాగునీటి సరఫరా కల్పించడంలో అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పనిచేయాలని కమిషనర్ సూచించారు. ఈ పర్యటనలో సూపరింటెండెంట్ ఇంజినీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవికుమార్, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ గ్రూప్-2

నోటిఫికేషన్ విడుదల

విజయవాడ, ఆయుధం: నిరుద్యోగులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. గ్రూప్-2పూర్తి స్థాయి నోటిఫికేషన్‌ను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మంగళవారం విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా 720 పోస్టులు భర్తీ చేయనున్నారు. మొత్తం ఖాళీల్లో 471 ఎగ్జిక్యూటివ్ పోస్టులు, 249 నాన్‌ఎగ్జిక్యూటివ్ పోస్టులను భర్తీ చేయనున్నారు. గ్రూప్2 ఉద్యోగాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు నేటి నుంచే ప్రారంభమయ్యాయి. దరఖాస్తులు సమర్పించడానికి డిసెంబర్ 11వ తేదీ రాత్రి 11:59 గంటల వరకు తుది గడువుగా ఏపీపీఎస్సీ పేర్కొంది.వచ్చే ఏడాది ఫిబ్రవరి 21న గ్రూప్2 స్క్రీనింగ్ టెస్టు ఆఫ్‌లైన్‌లో నిర్వహించనున్నారు. ఇది ఓఎంఆర్ ఆధారితంగా ఉంటుంది. ఆన్‌లైన్‌లో జరిగే మెయిన్ పరీక్ష తేదీలను తర్వాత వెల్లడిస్తారు. ఎగ్జిక్యూటివ్ విభాగంలో అత్యధికంగా 203 డిప్యూటీ తహసీల్దార్, 176 డిప్యూటీ ఎంపీడీఓ పోస్టులు ఉన్నాయి. గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ ఆఫీసర్ (GST) 40, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్సై 29, నాన్‌ఎగ్జిక్యూటివ్ విభాగంలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ASO) 80, సీనియర్ అకౌంటెంట్ 91 పోస్టుల చొప్పున భర్తీ చేయనున్నారు.



శ్రీదత్త క్షేత్రంలో వైభవంగా

అభివృద్ధి హోమం

- లోక కల్యాణార్థం ప్రత్యేక పూజ


హనుమకొండ, ఆయుధం: లోక కళ్యాణార్థం ప్రతి ఒక్కరు అభివృద్ధి చెందాలని స్వామీజీ ఆశీస్సులతో కార్తీకమాసం మంగళవారం సాయంత్రం వేద పండితులచే అభివృద్ధి హోమము వైభవంగా నిర్వహించారు. మైసూర్ అవధూత దత్త పీఠం సభ్యులు బ్రహ్మ శ్రీ కళ్యాణ్ కుమార్ శర్మ, బ్రహ్మశ్రీ చక్రవర్తి శర్మ, బ్రహ్మ శ్రీ దిలీప్ శర్మ శ్రీభద్రకాళి దేవస్థానం ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు దత్త క్షేత్రం అర్చకులు రాపాక గోపి కృష్ణ శర్మ, గోపికృష్ణ శర్మ, ఇతర పండితులచే వేద మంత్రము లచే హోమం నిర్వహించారు. ప్రతి ఒక్కరు వృత్తి, విద్యా, ఉద్యోగం, వ్యాపారం, వైద్య ఇతర రంగాలతో పాటు అన్ని రంగంములలో అభివృద్ధి జరగాలని హోమం నిర్వహించారు. అనంతరం పూర్ణ హుతి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వ రాజు సారయ్య, మాజీ ఎంపీపీ బాసని చంద్రప్రకాష్, ఆశ్రమం ట్రస్ట్ సభ్యులు వైవీ వామన్ రావు, prof కృష్ణ ప్రసాద్, యుగంధర్ రావు, శ్రీనివాస్ రావు, కుమారస్వామి, శ్రీనివాస్, మాతృ మండలి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



రామప్ప ఐలాండ్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- టూరిజం నోడల్ అధికారి డా.ఎ.ధర్మ నాయక్

ములుగు, ఆయుధం: రామప్ప సరస్సు ఐలాండ్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని టూరిజం నోడల్ అధికారి ధర్మ నాయక్ సూచించారు. మంగళవారం రామప్ప సరస్సు ఐలాండ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణాల పురోగతిని సమీక్షించి, పనుల నాణ్యతను తనిఖీ చేశారు. పెండింగ్ పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టూరిజం ఏఈ విజయ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అగ్నిప్రమాద బాధితులకు మాజీ ఎమ్మెల్యే ఆర్థిక సాయం

భూపాలపల్లి, ఆయుధం: భూపాలపల్లి పట్టణంలోని గణేశ్ చౌక్‌లో ఫారెస్ట్ కార్యాలయం ఎదుట జాతీయ రహదారి ఫుట్‌పాత్‌పై తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసుకుని పూల వ్యాపారం చేసుకుంటున్న నాలుగు దుకాణాలు దీపావళి రోజు రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి బాధితులను పరామర్శించి, కాలిపోయిన షెడ్లను పరిశీలించారు. బాధితులను ప్రభుత్వం తరపున ఆదుకునేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. తహసీల్దార్ కు ఫోన్ చేసి, నష్టపోయిన వ్యాపారులకు త్వరగా సహాయం అందించాలని కోరారు. అనంతరం పర్ధం చంద్రకళ భూమయ్య, ఇర్ణాల జానీ, ఇర్ణాల లక్ష్మి, మల్లికార్జున్ కు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఒక్కరికి రూ.5000/ చొప్పున రూ. 20,000/ ఆర్థిక సహాయం అందించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



కారా చట్టం ద్వారా దత్తత తీసుకోవాలి

- అక్రమ దత్తత చెల్లదు
- డాక్టర్ అనితా రెడ్డి

హనుమకొండ, ఆయుధం: అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, ఫార్మర్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి హన్మకొండ లోని శిశుగృహను సందర్శించారు. పిల్లల కేర్ అండ్ ప్రొటెక్షన్ అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో అమ్మలా సమయం గడిపి పిల్లలకు కబుర్లు చెప్పి ఆడించారు. పిల్లలకు, సిబ్బందికి స్వీట్స్ అందించారు. ఏ అవసరం ఉన్న తను సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. సిబ్బంది కి పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని అన్నారు. డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలమేరకు చట్ట బద్ధంగా దత్తత ప్రక్రియ పూర్తి చేయాలని, చట్ట బద్ధతలేని దత్తత చెల్లదని, ప్రభుత్వం కారా (CARA) చట్టం ప్రకారం పిల్లల దత్తత తీసుకోవాలని, అక్రమ దారులలో దత్తత తీసుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని అన్నారు. పిల్లలు వద్దనుకున్నవారు ప్రభుత్వానికి పిల్లలను సరెండర్ చేయవచ్చని.. అంతేకానీ పిల్లలను చెత్తకుండీలలో, ముళ్ళపొదలలో విసిరేయవద్దని విజ్ఞప్తి చేశారు. పిల్లలు లేక ఎందరో బాధపడుతున్నారని అన్నారు. శిశుగృహ లో ఉన్న పిల్లల దత్తత ప్రక్రియ సంబంధిత అధికారులు త్వరగా పూర్తిచేయాలని, అప్పుడు వారికి కుటుంబాన్ని అందించి కొత్త జీవితాన్ని బహుమతిగా అందించినవారమవుతామని అన్నారు. అక్రమదత్తతలు ఆగాలంటే, దత్తత చట్టంపై గ్రామీణ స్థాయి నుండి నగర స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. శిరీష సిబ్బంది పాల్గొన్నారు.



టీజీపీఎస్సీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలి

- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

హనుమకొండ, ఆయుధం: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించే డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీఈవో/ గెజిటెడ్ హెడ్‌మాస్టర్ గ్రేడ్ 1) పరీక్షలకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల అధికారులతో టీజీపీఎస్సీ నిర్వహించే పరీక్షలు నిర్వహణపై సమన్వయ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య, విద్యుత్, పోలీస్, ఆర్టీసీ శాఖల అధికారులతో పాటు పరీక్షా కేంద్రాల ప్రతినిధులతో ఏర్పాట్ల సంబంధించిన అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ.. ఈ నెల 12, 13 తేదీల్లో నిర్వహించే డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీఈవో / గెజిటెడ్ హెడ్‌మాస్టర్ గ్రేడ్ 1) పరీక్షకు కేటాయించిన పరీక్షా కేంద్రాలలో పటిష్ట ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. 12వ తేదీన జరగనున్న పరీక్షకు 1825 మంది అభ్యర్థులు, 13వ తేదీన జరగనున్న పరీక్షకు 1825 మంది అభ్యర్థులు(మొత్తం పరీక్ష రాసే అభ్యర్థులు(3650) పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు. హనుమకొండ వడ్డేపల్లి లోని అయాన్ డిజిటల్ జోన్, ములుగు క్రాస్ రోడ్ లోని ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఎదురుగా ఉన్న శ్రీ గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాల, రామారం(భీమారం) పొద్దుటూరి గార్డెన్స్ సమీపంలోని మోక్షిత్ కంప్యూటర్స్, హనుమకొండ గోపాల్ పూర్ కల్లుమండవ సమీపంలోని ఎన్ఎస్ గ్లోబల్ టెక్నాలజీస్, హసన్పర్తి చింతగట్టు హైవే సమీపంలోని నోబెల్ టెక్నాలజీ అండ్ సొల్యూషన్స్ లలో పరీక్ష జరుగుతుందన్నారు. జిల్లాకు సంబంధించి 3,650 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరుకానున్న నేపథ్యంలో పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, పోలీస్ ఇన్స్పెక్టర్ చంద్రమోహన్, ఆర్టీసీ డిఎం ధరమ్ సింగ్, కలెక్టరేట్ పరిపాలన అధికారి గౌరీ శంకర్, ఇతర అధికారులతో పాటు పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, ఆయా పరీక్షా కేంద్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలి

- సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా



వరంగల్, ఆయుధం: భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వరంగల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఏకశిలా పార్కు నుండి ర్యాలీగా వెళ్లి కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ వై.వి.గణేష్ కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా మాట్లాడుతూ..ఎల్ నినొ వల్ల జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని.. కరువుతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇప్పటికే కొన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినప్పటికీ, వాస్తవంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొంటున్న గీసుకొండ, నల్లబెల్లి, ఖానాపురం, రాయపర్తి, వర్ధన్నపేట మండలాలను కరువు మండలాలుగా ప్రకటించకపోవడం అన్యాయమని విమర్శించారు. వరంగల్ జిల్లాలో కరువు పరిస్థితులను శాస్త్రీయంగా అంచనా వేయకుండా మండలాలను ఎంపిక చేయడం వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వ సహాయం అందకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితులను పరిశీలించకుండా కేవలం గణాంకాల ఆధారంగా కరువు మండలాలను ప్రకటించడం సరైన విధానం కాదన్నారు. ఇది రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని స్పష్టం చేస్తోందని పేర్కొన్నారు. రైతులు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన వరి, పత్తి, మొక్కజొన్న పంటలు నీరు లేక ఎండిపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అప్పులు చేసి వ్యవసాయం చేసిన రైతులు పెట్టుబడులు కూడా తిరిగి రాక అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారని అన్నారు. పంటల వారీగా నష్టపరిహారం అందించాలి వరి పంటకు ఎకరానికి రూ.30,000 పత్తి పంటకు ఎకరానికి రూ.50,000 మొక్కజొన్న పంటకు ఎకరానికి రూ.50,000, ఈ మేరకు పూర్తిగా లేదా తీవ్రంగా పంట నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులను కూడా గుర్తించి ప్రభుత్వ సహాయం అందించాలని కోరారు. జిల్లావ్యాప్తంగా గ్రామాల వారీగా సమగ్ర పంట నష్టాల సర్వే నిర్వహించి, అర్హులైన రైతులందరికీ పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని కోరారు. రైతుల వ్యవసాయ రుణాలను రీషెడ్యూల్ చేసి, కరువు పరిస్థితుల్లో రైతులకు రుణ ఉపశమనం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని కరువు పరిస్థితులను గుర్తించి తక్షణమే రూ.20,000 కోట్ల ప్రత్యేక కరువు సహాయక నిధులను రాష్ట్ర ప్రభుత్వానికి మంజూరు చేయాలని కోరారు.

రైతాంగాన్ని ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించకుండా యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని షేక్ బాష్ మియా డిమాండ్ చేశారు. కరువు పరిస్థితులపై ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న తీవ్రమైన కరువు పరిస్థితుల నేపథ్యంలో తక్షణమే రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల నిత్యవసర వస్తువులను అందించాలి. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శిలు పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు సయ్యద్ వల్లి ఉల్లా ఖాద్రి, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండె బద్రి, రమేష్, సంగీ ఏలేందర్, రమేష్, చెన్నకేశవులు, శంకరయ్య, రైతు సంఘం రాష్ట్ర నాయకులు నెట్టం నారాయణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చుక్క మొగిలి, జిల్లా సమితి సభ్యులు తాళ్లపల్లి జాన్ పాల్, ఎండి.అక్బర్ పాషా, జన్ను రవి, శరత్, పార్థసారథి, సాంబమూర్తి, సుధీర్, యాకాంబ్ర చారి, రాజేందర్, సుంకరి భవాని, గోవర్ధన్, సాయిలు, వీరునాయక్, ప్రభాకర్, శ్వేత, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేయాలి



వరంగల్, ఆయుధం: వరంగల్ నగరంలోని పోచం మైదాన్ సర్కిల్ లో ఎన్ హెచ్ ఎం జేఏసీ ఆధ్వర్యంలో చేపడుతున్న నిరవధిక సమ్మె మంగళవారం నాటికి 29వ రోజు చేరుకుంది. ఈ సందర్భంగా జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ... తక్షణమే ఎన్ హెచ్ ఎం ఉద్యోగులందరినీ రెగ్యులరైజేషన్ చేయాలని, అప్పటివరకు ఎన్ హెచ్ ఎం ఉద్యోగులందరికీ 100% గ్రాస్ శాలరీ ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డ్స్ తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డా. టీ భరత్ కుమార్, డాక్టర్ గుండా రవీందర్, డాక్టర్ వి.మోహన్ రావు, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ రామ్ రాజు, డాక్టర్ నిఖిల్, డాక్టర్ యశస్విని, డాక్టర్ హరిక ఈవిన్ మేనేజర్ రవీందర్, డైకు మేనేజర్ మేర్గు అనిల్ కుమార్, నర్సింగ్ ఆఫీసర్స్ మేకల మంజుల, సుమలత, కళ్యాణి, సుమలత, ఫార్మసీ ఆఫీసర్ నూకల అంజి యాదవ్, శివకుమార్, సతీష్ కుమార్, సంతోష్, పబ్లిక్ హెల్త్ మేనేజర్ జన్ను కోర్నెల్, వైకుంఠం, అకౌంటెంట్స్ కే శ్వేత, ఎం.శ్రీనివాస్ బాబు, టీబీ డిపార్ట్మెంట్ రంజిత్, రాకేష్, ఏ.ఎన్.ఎం.లు జ్యోతి, సుల్తానా, పేనీన, ఉప్పలమ్మ, శ్రీలత, ల్యాబ్ టెక్నీషియన్లు జూకంటి మౌనిక, ప్రవీణ్, ఎం.ఎన్.ఓ. ఏకుల చిరంజీవి, కల్వల కుమార్, బండి రాజేష్, అజ్మీర విజయ నాయక్, తోటి ఉద్యోగులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణలో న్యాయవాదుల పాత్ర కీలకం

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- ఐఎల్ పిఎ రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



హనుమకొండ, ఆయుధం: ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ లో ప్రజాస్వామ్య రక్షణ ద్వారానే ప్రజలు రక్షించబడతారని, ప్రజాస్వామ్య రక్షణలో న్యాయవాదులు కీలకపాత్ర పోషించాలని వరంగల్ పచ్చిమ ఎమ్మెల్యే నాయిని రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా కేంద్రం పచ్చిమ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ 6వ రాష్ట్ర సదస్సు కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాజకీయ విలువలు, రాజ్యాంగ హక్కులు, మానవీయ విలువల గూర్చి సామాన్య ప్రజలకు తెలియాల్సిన అవసరముందని, రాజకీయ పార్టీలతో అన్ని పనులు కావని, విలువలు, హక్కుల బోధనలో న్యాయవాదులు ముందుంటే ఆ సమాజంలో స్వేచ, సమానత్వం తొందరగా వస్తుందని అన్నారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ మంత్రి సీతక్కతో సహా హై కోర్టు మాజీ న్యాయమూర్తి, సీనియర్ సిటిజన్స్ కమీషన్ కమీషనర్ ఈద తిరుమలదేవి, వరంగల్ జిల్లా జడ్జి వి.బి నిర్మలా గీతాంబ, హనుమకొండ జిల్లా జడ్జి ఎం.ఆర్ సునీత తో పాటు వివిధ రంగాల మేధావులు హాజరయ్యే ఐ ఎల్ పి ఎ రాష్ట్ర సదస్సును ఈ నెల 14న హనుమకొండ హంటర్ రోడ్ 'డి' కన్వెన్షన్ లో నిర్వహించడం గొప్ప విషయమని, ఈ రాష్ట్ర సదస్సుకు న్యాయవాదులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రాచంద్రం, డెవలప్మెంట్ ఆఫీసర్ ప్రొఫెసర్ వై. ఎంకయ్య, లా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, ఆదర్శ లా కళాశాల చైర్మన్ బూర విద్యాసాగర్, ప్రొఫెసర్ డాక్టర్ కూరపాటి రమేష్ లను సదస్సు ఆహ్వాన పత్రికలను అందించి ఐ ఎల్ పి ఎ ఆర్గనైజింగ్ కమిటీ ఆహ్వానించారు. ఐ ఎల్ పి ఎ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ, సదస్సు కన్వీనర్ చిల్ల రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సామాజిక న్యాయం ప్రధాన ఎజెండాగా కార్యక్రమాలు చేస్తున్న ఐ ఎల్ పి ఎ రాష్ట్ర సదస్సులో ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని అన్ని బార్ ల నుండి న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐ ఎల్ పి ఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు తీగల జీవన్ గౌడ్, రాష్ట్ర కమిటి సభ్యులు జన్ను పద్మ, జిల్లా నాయకులు విలాసాగరం సురేందర్ గౌడ్, పూసపల్లి శ్రీనివాస్, నమ్మానీ చంద్రశేఖర్, జన్ను ఆనంద్ కుమార్, జంగా స్వప్న, గురిమిల్ల రాజు, ఎలమాద్రి రవి, సంధ్యారాణి పాల్గొన్నారు.

గుడిసెవాసులకు ఇంటి పట్టాలు అందించి, మౌలిక సదుపాయాలు కల్పించాలి

- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్ డిమాండ్



వరంగల్, ఆయుధం: వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండల పరిధిలోని పేదల కాలనీల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే ఇంటి పట్టాలు అందించి, కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దండు లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఖిలా వరంగల్ మండల పరిధిలో వందల ఎకరాల ప్రభుత్వ భూములను కొందరు ప్రైవేట్ వ్యక్తులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా ఆక్రమించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను కాపాడటంతో పాటు పేదలకు నివాస స్థలాలు కల్పించాలనే లక్ష్యంతో సుమారు ఆరు సంవత్సరాల క్రితం భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో వరంగల్ నగరంలో ఇంటి అద్దెలు చెల్లించలేని నిరుపేద కుటుంబాలకు గుడిసెలు వేసుకునేందుకు అండగా నిలిచామని తెలిపారు. నేటికీ అనేక ఆర్థిక, సామాజిక ఇబ్బందులను ఎదుర్కొంటూ కుటుంబాలతో సహా ఈ కాలనీల్లో నివసిస్తున్న పేదల పరిస్థితిని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఇంటి పట్టాలు మంజూరు చేయడంతో పాటు తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, అంతర్గత రహదారులు వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.
గుడిసెవాసుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఖిలా వరంగల్ మండల తహసీల్దార్ ఇక్బాల్ గారికి సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ వినతిపై తహసీల్దార్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలో పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, సంఘీ ఎలేందర్, కందిక చెన్నకేశవులు, రాజేందర్, జిల్లా సమితి సభ్యులు ధర్మారపు సాంబమూర్తి, లక్ష్మీపురం శాఖ సహాయ కార్యదర్శి తాటిపాముల ఉదయశ్రీ, తాత స్వాతి, శాఖ సభ్యులు షమీనా, నల్లిగంటి రజిని, వరికాల బాబు తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వే ను వేగవంతంగా పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ ఎన్. రవి



హనుమకొండ, ఆయుధం: భూముల రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ పరిశీలించారు. సర్వే జరుగుతున్న తీరును సర్వేయర్లు, స్థానిక రైతులను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ భూ రీ సర్వే ప్రక్రియలో స్థానిక రైతుల సహకారం ఎంతో ముఖ్యమన్నారు. రీ సర్వే ప్రక్రియ పారదర్శకంగా చేస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా వంగరలోని డాక్టర్ పివి రంగారావు తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను తనిఖీ చేశారు. విద్యార్థినులకు వండిన భోజన పదార్థాలను నాణ్యతను పరిశీలించారు. వంటగదిలోని నిత్యావసరాలను తనిఖీ చేశారు. విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను అదనపు కలెక్టర్ సందర్శించి అక్కడి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భూములు కొలతలు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నూర్ సింగ్, తహసీల్దార్ రాజేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.




టీపీసీసీ స్పోక్స్ పర్సన్ బోడ డిన్నకు జిల్లా అధ్యక్షుడి అభినందనలు

వరంగల్, ఆయుధం: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) స్పోక్స్ పర్సన్‌గా నూతనంగా నియమితులైన బోడా డిన్న వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ బోడా డిన్నను శాలువాతో ఘనంగా సత్కరించి, టీపీసీసీ స్పోక్స్ పర్సన్‌గా నియమితులైన సందర్భంగా హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ నాయకత్వం బోడా డిన్నకు అప్పగించిన ఈ బాధ్యతలు ఆయన రాజకీయ అనుభవానికి, పార్టీ పట్ల అంకితభావానికి నిదర్శనమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ విధానాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు పార్టీ బలోపేతానికి ఆయన విశేష కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు భాషాపాక సదానందం, కొత్తపల్లి శ్రీనివాస్, మొహమ్మద్ కమలుద్దీన్, ఎర్రం కమల్ తో పాటు పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొని డిన్నాను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

కార్తీక మాసం సందర్భంగా పంచారామాల దర్శనానికి ప్రత్యేక బస్సులు

- హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్



హన్మకొండ, ఆయుధం: కార్తీక మాసం సందర్భంగా శైవ క్షేత్రాలైన పంచారామాలకు హనుమకొండ నుండి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ తెలిపారు. భక్తుల సౌకర్యార్థం తెలంగాణలోని రామప్ప శ్రీ రామలింగేశ్వరాలయం, లక్నవరం సరస్సు, మేదారం సమ్మక్క సారలమ్మ, మల్లూరు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం, బొగత జలపాతం, కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం, భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం లతో పాటు హైదరాబాదు రామోజీ ఫిలిం సిటీ, సాలార్‌జంగ్ మ్యూజియం, గోల్కొండ కోట, ఆంధ్ర ప్రదేశ్ లోని ప్రసిద్ధి చెందిన పంచరామ క్షేత్రాలైన అమరావతి , ద్రాక్షారామం, భీమవరం, పాలకొల్లు, సామర్లకోట లలోని స్వామి వార్లను దర్శించుకునేలా ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. తమిళనాడులోని అరుణాచలంకు కూడా నడపడం జరుగుతుందని తెలిపారు. అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం శబరిమలై దేవస్థానానికి భక్తుల డిమాండ్ కు అనుగుణంగా ఈ ప్రత్యేక బస్సులు నడపడం జరుగుతుందని, మరిన్ని వివరాల కోసం 8977781103, 9493882464, 9949193893 లను సంప్రదించాలని డిఎం తెలిపారు.

ఏ హోదాకు వెళ్లినా గతం మరవొద్దు

(మొదటి పేజీ తరువాయి..)

ఆవేదన వ్యక్తం చేశారు. తాను బాధ్యతలు చేపట్టాక పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి, నియామక ప్రక్రియ చేపట్టినట్లు గుర్తు చేశారు. గతంలో రాజకీయ పునరావాస కేంద్రంగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉండేదని విమర్శించారు. అవగాహన లేనివారిని బోర్డులో నియమించి గత ప్రభుత్వం తప్పు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోలీసుల గౌరవాన్ని సీనియర్లు పెంచారు

అధికారుల నుంచి ప్రభుత్వం కోట్లు ఆశించట్లేదని, ఎన్నికల్లో రిగ్గింగ్ చేయాలని ఆదేశాలు కూడా ఇవ్వడం లేదన్నారు. బాధ్యత గుర్తించి నిజాయితీగా విధులు నిర్వర్తించాలని మాత్రమే ప్రభుత్వం కోరుకుంటుందని తెలిపారు. సర్వం ఒడ్డి శాంతిభద్రతలు కాపాడి, పోలీసుల గౌరవాన్ని సీనియర్లు పెంచారన్న సీఎం, పోలీసు శాఖ విశ్వాసమైన విభాగంగా కొనసాగించాల్సిన బాధ్యత మీపై ఉందని అన్నారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695